సాక్షి జనగామ

శుక్రవారం | 27 | జూన్ | 2025



సెమిస్టర్ల ఫలితాలు విడుదల

కాకతీయ యూనివర్సిటీ పరిధి డిగ్రీ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను గురువారం వీసీ కె.ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు.

-8లో



కంప్యూటర్ నాలెడ్జ్ కంపల్సరీ

ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులు ఉద్యోగాలు పొందాలంటే కంప్యూటర్ నాలెడ్జ్ తప్పనిసరిగా మారింది.

-8లో

గరిష్టం/కనిష్టం
34^0 /25^0

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

బతుకమ్మకుంట పనుల్లో వేగం పెంచాలి : కలెక్టర్

జనగామ రూరల్ : పట్టణంలోని బతుకమ్మకుంటలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి పనులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మకుంట అభివృద్ధి పనులకు రూ.కోటి 50 లక్షల నిధులు మంజూరయ్యాయని, పంచతంత్ర థీమ్‌తో అభివృద్ధి చేయాలని చెప్పారు. సుందరీకరణ నేపథ్యంలో గ్రిల్స్, వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆటస్థలం, ఆట పరికరాలు, చిన్న పార్కు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు చెరువు పూడికతీత పనులు, వాకింగ్ ఏరియా, లైటింగ్, ఫెన్సింగ్, ఒక వాటర్ ట్యాంక్ పనులు పూర్తయ్యాయని, మిగతావి త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. అకాల వర్షాల వల్ల చెరువు పూడికతీత పనులు ఆలస్యం కావడంతో సివిల్ పనులు చేసేందుకు వీలు కాలేదని పేర్కొన్నారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ రాజ్‌కుమార్, ఏఈ మహిపాల్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి




బచ్చన్నపేట: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి.. ఇందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూపరాణి సూచించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆమె గురువారం సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై సూచనలు చేశారు. డీఎల్పీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వద్దు



నర్మెట: పారిశుద్ధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు.. తడి పొడిచెత్తతో తయారు చేసిన సేంద్రియ ఎరువు పంచాయతీలకు అదనపు ఆదాయం తెచ్చిపెడుతుందని ఎస్‌ఎస్‌జీ డీసీ పి.శ్రీకృష్ణ, ఎస్‌బీఎం డీసీ రామగుండం కరుణాకర్ అన్నారు. మండల పరిధి బొమ్మకూర్, బొమ్మకూర్‌తండా, రాళ్లబాయితండాల్లో ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్లు, సీసీరోడ్లు, ఇంకుడుగుంతలు తదితర అభివృద్ధి పనులను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యదర్శి సుజాతకు పలు సూచనలు చేశారు. భూగర్భ జలాల పెరుగుదలకు చర్యలు చేపట్టాలని, వృక్షసంపదను పెంచాలని చెప్పారు. అనంతరం రాళ్లబాయితండా ఎంపీపీఎస్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. హెచ్‌ఎం బిర్రు ఉప్పలయ్య పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యం



పాలకుర్తి: గిరిజన లబ్ధిదారులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన ఉండాలని హనుమకొండ, జనగామ జిల్లాల అసిస్టెంట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బానోతు రూపాదేవి అన్నారు. మండల పరిధిలో ఎంపిక చేసిన కొండాపురం, మైలారం గ్రామాల్లో గురువారం ఎంపీడీఓ రాములు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఎంపీఓ రవీందర్, జీపీ కార్యదర్శి యూసుఫ్, మాజీ సర్పంచ్ కిషన్, లక్‌పతి గుగులోతు పాటిల్, కమిటీ చైర్మన్ రామ్‌సింగ్, ఏఈఓ కీర్తి తదితరులు పాల్గొన్నారు.

బోనస్ జమచేయాలి

జనగామ రూరల్: ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్న రకం ధాన్యానికి సంబంధించిన బోనస్ డబ్బులను రైతుల ఖాతాల్లో జమచేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సంఘం ఆధ్వర్యాన కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చందునాయక్ మాట్లాడుతూ రైతులు పండించే దొడ్డు, సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం కేవలం సన్న రకానికే అమలు చేస్తోందన్నారు. జిల్లాలో రైతులకు సుమారు రూ.12 కోట్ల బోనస్ డబ్బులు పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. రైతులు పండించే అన్ని రకాల పంటలకు బోనస్ అమలు చేయాలని, లేదంటే తహసీల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య, ఉపాధ్యక్షుడు మంగ బీరయ్య, నాయకులు కర్రె రాములు, కర్ర బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ స్కూల్స్ ఇంకెప్పుడు..?

- తల్లిదండ్రులను ఒప్పించి అడ్మిషన్లు
- టీచర్, ఆయాల నియామకం లేక ముందుకు సాగని స్కూళ్ల నిర్వహణ
- అధికారిక ఉత్తర్వుల కోసం ఎదురుచూపులు



పోచన్నపేట పీఎస్‌లో ప్రీ ప్రైమరీ స్కూల్ నిర్వహిస్తున్న టీచర్

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం సర్కారు స్కూళ్లలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ(ప్రీ ప్రైమరీ) విద్యను అమలు చేస్తున్నట్లు నూతన విద్యా సంవత్సరానికి ముందుగానే ప్రకటించింది. రాష్ట్రంలో వెయ్యి ప్రీ ప్రైమరీ స్కూళ్లను ప్రారంభించబోతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. దీంతో ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు ప్రభుత్వ ఉద్దేశాన్ని 'బడిబాట'లో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ వారి పిల్లలను ప్రీ ప్రైమరీ స్కూల్‌లో చేర్పించుకున్నారు. రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ పీఎస్‌లో సుమారు 40, జనగామ మండలం యశ్వంతాపూర్‌లో 25, పసరమడ్లలో 25, ఇతర పాఠశాలల పరిధిలో ప్రీ ప్రైమరీ అడ్మిషన్ల సంఖ్య పెరిగింది. అయితే ఇటీవల 210 ప్రీ ప్రైమరీ పాఠశాలల సంబంధించి విడుదల చేసిన జాబితాలో జనగామ జిల్లాకు చోటు దక్కలేదు. మిగతా పాఠశాలల్లో సైతం ఈ విద్యను అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ.. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై పదిహేను రోజులు గడిచిపోతున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. సర్కారు నిర్లయంలో ఆలస్యం జరుగుతుండడంతో తల్లిదండ్రులకు హామీ ఇచ్చిన ఉపాధ్యాయులు సందిగ్ధంలో పడిపోయారు. ప్రీ ప్రైమరీలో నేటికీ విద్యాబోధన ప్రారంభం కాకపోవడంతో కొద్ది రోజులు వేచి చూసి తమ పిల్లలను ప్రైవేట్ కిడ్స్ స్కూళ్లకు పంపించేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. ఇలా అయితే ప్రభుత్వ పాఠశాలల పరిధిలో వచ్చే విద్యాసంవత్సరం ఒకటో తరగతి అడ్మిషన్ల సంఖ్య తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రెండేళ్ల క్రితమే మూడు ప్రీ ప్రైమరీ..

జిల్లాలో రెండేళ్ల క్రితమే సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్‌ఎస్‌ఏ) స్కీంలో మూడు పాఠశాలల పరిధిలో ప్రీ ప్రైమరీ స్కూల్స్ నిర్వహిస్తున్నారు. బచ్చన్నపేట మండలం పోచన్నపేట పీఎస్(55), కొడవటూరు పీఎస్(10), బచ్చన్నపేట పీఎస్(25)లో ఈ విద్య కొనసాగుతున్నది. చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీగా స్థానికంగా నివసించే నిరుద్యోగుల నుంచి అర్హత ఆధారంగా ఒక టీచర్, ఆయాను నియమించారు. టీచర్‌కు నెలవారీ వేతనం రూ.8వేలు, ఆయాకు రూ.6వేలతో పాటు ఏడాదికి రూ.1.50లక్షల నిధులను ఎస్‌ఎస్‌ఏ ద్వారా అందిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న ప్రీ ప్రైమరీ స్కూళ్లను జిల్లాలో ఏర్పాటు చేస్తే సంఖ్య ఆధారంగా నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు పేద కుటుంబాల తల్లిదండ్రులపై ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల భారం తగ్గుతుంది. అంతే కాకుండా ప్రభుత్వ స్కూళ్లలో ఒకటో తరగతి అడ్మిషన్లు పెరగడానికి దోహదపడుతుంది.

ఇదీ సర్కారు ఉద్దేశం..

ప్రీ ప్రైమరీ స్కూల్ విద్యా బోధన పిల్లల అధికారిక అభ్యసనా అనుభవంలో ప్రాథమిక దశకు కీలకంగా ఉపకరిస్తుంది. మూడు నుంచి ఐదేళ్ల వయసు చిన్నారుల కోసం ఈ విద్యకు రూపకల్పన చేశారు. ప్రీ ప్రైమరీలో పిల్లలకు అభ్యాసంపై ప్రేరణ కలిగించడం, వారిలోని నైపుణ్యాలను గుర్తించే అవకాశం ఉంటుంది. చిత్రలేఖనం, కథలు చెప్పడం, ఆటలు, రంగులు, ఆకారాలు, అక్షరాలు, సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడుతుంది. ఐదేళ్లు నిండక ముందే పిల్లలు సహచర స్నేహితులు, పెద్దలతో మాట్లాడడంలో సహాయ పడుతుంది. కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవడానికి పునాదిగా పనిచేస్తుంది. సర్కారు స్కూళ్లలో ఒకటో తరగతిలో అడ్మిషన్ల సంఖ్య పెరగడానికి అవకాశం కలుగుతుంది.

గ్రీన్ సిగ్నల్ రాగానే..



జిల్లాలో ప్రీ ప్రైమరీ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం. అయినప్పటికీ ప్రీ ప్రైమరీ స్థాయి పిల్లలను అంగన్‌వాడీతో పాటు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించి బోధన సాగిస్తున్నాం. ప్రీ ప్రైమరీ స్థాయిలో ఆశించిన మేర అడ్మిషన్లు వచ్చాయి. ఈ విద్యకు ఎక్కడా ఆటంకం లేదు.

\- భోజన్న, డీఈఓ

మూడింట్లో నిర్వహిస్తున్నాం..



బచ్చన్నపేట మండల పరిధి మూడు పాఠశాలలో రెండు సంవత్సరాలుగా ప్రీ ప్రైమరీ స్కూల్స్ నడిపిస్తున్నాం. ఇందులో సుమారు 90 మంది పిల్లలు ఉన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ఇందులో చిన్నారుల అభ్యసనా సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

\- బొమ్మగాని శ్రీనివాస్,
జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి



కమ్యూనిటీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే

చిల్పూరు: రాజకీయంగా జన్మనిచ్చిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం.. ఇందుకు తమ ప్రతీ అడుగు ఆ దిశగా ఉంటుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మల్కాపూర్‌లో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఎస్సీ కమ్యూనిటీ భవనం, చిన్నపెండ్యాలలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించే రెడ్డి కమ్యూనిటీ భవన నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకుల కారణంగా నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని, ఇక నుంచి ఏడాదిలో ప్రతిపక్షాల గొంతులు మూగబోయేలా అభివృద్ధి చేస్తానని చెప్పారు. దేవునూరుగుట్టను ఎకో టూరిజంగా మారుస్తామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్ పార్కు ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్‌రావు, పార్టీ నాయకులు సురేష్, యశ్వంతరెడ్డి, మల్లారెడ్డి, మామిడాల లింగారెడ్డి, వెంకట్‌రెడ్డి, కె.పోషయ్య, జంగం రవి, రంజిత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, యాదవరెడ్డి పాల్గొన్నారు.

ఘన్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌గా రాధాకృష్ణ

- ఆరు నెలల్లో మూడో కమిషనర్



బాధ్యతలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బండ్ల రాధాకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం జీడబ్ల్యూఎంసీ కాజీపేట సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న రవీందర్ ఇక్కడ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే.. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ శాఖలో చేపట్టిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా సత్తుపల్లి మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న రాధాకృష్ణను పదోన్నతిపై ఘన్‌పూర్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో నీరు, వీధిదీపాలు, పారిశుద్ధ్య సమస్యపై ప్రత్యేకంగా పనిచేస్తానని, నూతనంగా ఏర్పడిన ఈ మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. ప్రజలు సహకరించాలని కోరారు.

జనవరి 27న మున్సిపాలిటీగా..

ఘన్‌పూర్ మున్సిపాలిటీ ఈ ఏడాది జనవరి 27న ఏర్పడింది. మొదటి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణారెడ్డి వారం రోజుల అనంతరం హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. కాజీపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. కాగా ప్రస్తుతం రాధాకృష్ణ పూర్తి స్థాయి కమిషనర్‌గా వచ్చారు.

నూతన కమిషనర్‌కు పలువురి సన్మానం

కమిషనర్ రాధాకృష్ణను కాంగ్రెస్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అంతకు ముందు కమిషనర్.. కలెక్టర్ రిజ్వాన్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్: కార్మిక వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు కోరారు. ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన గురువారం మున్సిపల్ కమిషనర్‌కు నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొడెపాక యాకయ్య, నీల శ్రీనివాస్, గూడురు పూర్ణచందర్, కొంతం చిరంజీవి, రాజేంద్రప్రసాద్, రాజు, అనిల్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

గడువు మూడురోజులే..

- ఈనెల 30తో ముగియనున్న ఎల్‌ఆర్‌ఎస్ 25 శాతం రాయితీ..
- వచ్చిన అప్లికేషన్లు 18,095.. ఆదాయం రూ.6.68కోట్లు
- అండర్ ప్రాసెస్‌లో 1,979 దరఖాస్తులు



జనగామ మున్సిపల్ కార్యాలయం

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) రాయితీకి ఇచ్చిన మరో అవకాశం గడువు మూడు రోజుల్లో ముగియనుంది. ప్లాట్ల యజమానుల నుంచి అనుకున్న మేర స్పందన లేకపోవడంతో 25 శాతం రాయితీ సదుపాయాన్ని ఆరోసారి ఈనెల 30వ తేదీ వరకు గడువు పొడిగించింది. జనగామ పురపాలికలో 2020 సంవత్సరం ఎల్‌ఆర్‌ఎస్ అప్లికేషన్లు 18,095 వచ్చాయి. ఇప్పటి వరకు 2,823 మంది ఫీజు చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకున్నారు. 1,979 దరఖాస్తులు అండర్ ప్రాసెస్‌లో ఉన్నారు. ఇందులో 2,823 మందికి ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఇప్పటి వరకు పురపాలికకు రూ.6.68 కోట్ల మేర ఆదాయం సమకూరింది.

ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోండి



ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ప్రభుత్వం పొడిగించిన 25 శాతం రాయితీ గడువు ఈనెల 30 వరకు ఉంది. లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) ద్వారా ఫీజు చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

\- ప్రశాంతి, టీపీఎస్, జనగామ పురపాలిక

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జనగామ రూరల్ : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా యువత పోరాడాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ, విద్యా, వైద్యం, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏఎస్పీ పండరి నితిన్ చేతన్‌తోపాటు పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బస్టాండ్ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం ర్యాలీ కామాక్షి ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వినియోగిస్తున్న వారి వివరాలను తెల్లకాగితంపై రాసి పోస్ట్‌బాక్స్‌లో వేయాలని, ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు ఇస్తామన్నారు. డీసీపీ రాజమహేంద్రనాయక్ మాట్లాడుతూ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ భోజన్న, జిల్లా సంక్షేమాధికారి ఫ్లోరెన్స్, డీఎంహెచ్ఓ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యాన డీఏడబ్ల్యూఎస్ డ్రగ్ ఫ్రీ ఇండియా స్కీమ్–2025పై శామీర్‌పేట జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాలు మనుషులపై తీవ్ర ప్రభావం చూపుతాయని, వాటికి బానిస కావొద్దని సూచించారు. మాదకద్రవ్యాలు అమ్మేవారు చిన్న పిల్లలను టార్గెట్ చేస్తారని అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు వివరించారు. ఏ రూపంలోనైనా మత్తు పదార్థాలు ఉండవచ్చని జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ద్విచక్ర వాహనాలపై లిఫ్ట్ ఇస్తాను అంటే బాలికలు వెళ్లకూడదని పేర్కొన్నారు. అలాగే బాల్య వివాహాలపై మాట్లాడుతూ.. 18 ఏళ్ల వయసు లోపు వివాహం చేసుకోవద్దని, అలా వివాహం చేసిన వారు చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నీరజ, భీమయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి సహస్ర కలశాభిషేకం



శాకంబరీ నవరాత్రి మహోత్సవం సందర్భంగా అమ్మవారి అలంకరణ

వైభవంగా శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం





ఆలయంలో భక్తుల రద్దీ, అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

హన్మకొండ కల్చరల్: వరంగల్ నగరంలోని శ్రీభద్రకాళి దేవాలయంలో శాకంబరి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి సహస్ర కలశాభిషేకోత్సవం శోభాయమానంగా జరిగింది. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, దేవాలయం ధర్మకర్తల మండలి చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం అమ్మవారి సన్నిధిలో జ్యోతిప్రజ్వలనం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. సహస్ర కళశాభిషేకం మధ్యాహ్నం ప్రారంభమైంది. భద్రకాళి పంచమూర్తులకు, శ్రీచక్రానికి అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని కాళీక్రమంలో అలంకరించారు. రాత్రి కామేశ్వరీనిత్యాక్రమంలో ఆవరణార్చనలు జరిపా రు. భక్తులతో దేవాలయం కిక్కిరిసిపోయింది. భద్రకాళి శరణంమమ అంటూ జయజయధ్వానాలు చేస్తూ పులకించిపోయారు. ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషు భారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శుక్రవారం ఉదయం కపాలినీ క్రమంలో, సాయంత్రం భగమాలినిక్రమంలో పూజలు జరపనున్నారు.

ప్రభుత్వం విద్యా విధ్వంస విధానాలను మానుకోవాలి

- విద్యా పరిరక్షణ కమిటీ బాధ్యులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జనగామ రూరల్: కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసే విధానాలను మానుకోవాలని విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మయ్య, ఇ.రామిరెడ్డి అన్నారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ఈనెల 27న నిర్వహించే ధర్నా కరపత్రాలను గురువారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కారు విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణను వేగిరం చేయడానికి నూతన జాతీయ విద్యావిధానాన్ని తీసుకువచ్చిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసిన గత సర్కారు విధానాలనే ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్, పబ్లిక్ స్కూల్స్, ఫౌండేషన్ స్కూల్స్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో విద్యారంగంలో తీసుకొస్తున్న మార్పులు అన్ని స్థాయిల్లో దళిత, ఆదివాసీ, నిరుపేద, మధ్య తరగతి ప్రజలకు విద్యను దూరం చేసేలా ఉన్నాయన్నారు. రాజు, అంకుశావళి, యాదగిరి, శివరాం, జి.శ్రీరామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగును ప్రోత్సహించాలి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: సేంద్రియ వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల, తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయంతోనే మానవ మనుగడ సాధ్యమని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేలా అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రతీ గ్రామంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చుడాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రామారావునాయక్, ఏడీఏ అజ్మీరా పరశురాం నాయక్, ఏఓలు శరత్‌చంద్ర, దివ్య, విజయ్‌రెడ్డి, వీరభద్రం, రామనర్సయ్య పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో కోతుల హల్‌చల్





ఎంసీహెచ్‌లో సంచరిస్తున్న కోతులు

జనగామ మండలం చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో గురువారం కోతులు హల్‌చల్ చేశాయి. వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, సహాయకులపై కోతులు దాడి చేయడానికి ప్రయత్నించడంతో వారు భయంతో పరుగులు పెట్టారు. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది వానరాలను బయటకు తరమడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. – జనగామ

గడ్డం కేశవమూర్తికి ఎన్టీఆర్ అవార్డు



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కేశవమూర్తి

హన్మకొండ అర్బన్ : సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ రచయిత గడ్డం కేశవమూర్తికి విజయవాడకు చెందిన ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని పద్మశ్రీ ఎన్టీ రామారావు స్మారక అవార్డు ప్రకటించింది. ప్రముఖ సినీ నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తోపాటు గడ్డం కేశవమూర్తికి ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి సీతక్క చేతుల మీదుగా కేశవమూర్తి ఈ అవార్డును అందుకున్నారు. కేశవమూర్తికి అవార్డు లభించడం పట్ల వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

కన్సల్టెన్సీల కార్మిక దోపిడీ అరికట్టాలి



ఈదురు వెంకన్న

హన్మకొండ: ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సుల కన్సల్టెన్సీల కార్మిక దోపిడీని అరికట్టాలని టీజీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. జేబీఎం ఎలక్ట్రిక్ బస్సులకు డ్రైవర్లను సరఫరా చేస్తున్న శ్రీ బాలాజీ కన్సల్టెన్సీ, సిస్కాన్ సంస్థలు డ్రైవర్ల జీతాల నుంచి పీఎఫ్ డబ్బులు కోత విధించి 5 నెలలుగా ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో జమ చేయకుండా సొంతానికి వాడుకోవడం అన్యాయమని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5 నెలల నుంచి జేబీఎం బస్సులపై పని చేస్తున్న కార్మికుల జీతాల నుంచి పీఎఫ్ పేరుతో నెలకు రూ.3 వేల చొప్పున వసూలు చేసి ఖాతాలో జమ చేయకపోవడాన్ని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. పీఎఫ్ సొమ్ము దుర్వినియోగంపై జేబీఎం, ఆర్టీసీ యాజమాన్యం వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకుని ఆ సొమ్మును పీఎఫ్ ఖాతాలో జమ చేయించాలని డిమాండ్ చేశారు.

కేయూ పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు జూలై 25నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి సౌజన్య గురువారం తెలిపారు. ఈ మేరకు గురువారం టైం టేబుల్ విడుదల చేశారు. పీజీ కోర్సుల ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ జర్నలిజం మాస్ కమ్యూనికేషన్, ఎంఎల్ఐఎస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంహెచ్‌ఆర్ఎం కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నారు. జూలై 25, 28, 30, ఆగస్టు 1, 4, 6వ తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు సౌజన్య తెలిపారు.

కంప్యూటర్ నాలెడ్జ్ కంపల్సరీ..

- అప్పుడే కొలువు సాధ్యం.. లేనిపక్షంలో కలే..
- చదువుతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలంటున్న నిపుణులు



ఖిలా వరంగల్ : ఇంజనీరింగ్.. ఒకప్పుడు డిమాండ్ ఉన్న కోర్సు.. ఈ చదువు పూర్తయిందంటే ఉద్యోగం వచ్చినట్లే. జీవితంలో ఇక స్థిరపడినట్లే. మరిప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. కోర్సు పూర్తయినా ఉద్యోగం వస్తుందనే నమ్మకం లేదు. దీనికి ప్రధాన కారణం కంప్యూటర్ నాలెడ్జ్ లేకపోవడమే. ఇంజనీరింగ్ విద్యతోపాటు కంప్యూటర్ నాలెడ్జ్ ఉండాల్సిందే. అప్పుడే కొలువు దక్కుతుంది. లేనిపక్షంలో ఉద్యోగం కలగానే మిగులుతుంది.

చదువుకు.. చేసే పనికి ఉండని పొంతన..

ఇంజనీరింగ్ కోర్సు పూర్తయిన తర్వాత యువత ఏదో ఒక చిన్న ఉద్యోగంలో చేరుతున్నారు. ఇక్కడ తన చదువుకు.. చేసే పనికి పొంతనే ఉండడం లేదు. ఎందుకంటే.. ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత ఏం చేయాలనే అంశంపై అవగాహన ఉండడం లేదు. ఫలితంగా కొంత మంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఇతర ప్రాంతాల్లో ఏదో ఒక చిన్న ఉద్యోగం చేస్తూ కాలం గడుపుతున్నారు. యువత ఇక నుంచి అలా చేయొద్దు. ఇంజనీరింగ్ పూర్తయిన తర్వాత ఈ కోర్సులు చేస్తే ఉద్యోగాలు మీ సొంత మవుతాయి. దీనిపై 'సాక్షి' ప్రత్యేక కథనం

ఉద్యోగ వేటలో ఇంజనీరింగ్ విద్యార్థులు..

ఇంజనీరింగ్ చదివితే ఉద్యోగం వస్తుందనుకున్న కొంతమంది విద్యార్థులు నిరుత్సాహం చెందక తప్పడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏటా సుమారు 3వేలకుపైగా విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసుకుని బయటకు వస్తున్నారు. 30 నుంచి 40 శాతంలోపే వారికి క్యాంపస్ ఇంటర్వ్యూలు ద్వారా ఉద్యోగాలు లభిస్తున్నాయి. మిగతా వారు ఇంజనీరింగ్ పట్టాలతో ఉద్యోగాల వేట ప్రారంభిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం కంప్యూటర్ నాలెడ్జ్, ఉద్యోగానికి సంబంధించిన కంప్యూటర్ కోర్సు నేర్చుకోకపోవడమే. ఫలితంగా యువత ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధంలేని ఉద్యోగాల్లో స్థిరపడుతోంది. ఉద్యోగం సులభంగా సాధించాలంటే ఇంజనీరింగ్ చదువుకు కంప్యూటర్ కోర్సు యాడ్ చేయాల్సిందే. అప్పుడే అతిసులభంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో స్థిరపడొచ్చు. ఇందులో కొన్ని కోర్సులు ఇలా ఉన్నాయి.

సీఎస్ఈ గ్రూప్ ..

ఇంజనీరింగ్‌లో సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) గ్రూప్ పూర్తి చేసిన విద్యార్థులు 6 నెలల నుంచి సంవత్సర వరకు ఉండే కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవాలి. ఆ కోర్సులు బిగ్‌డేటా ఎనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నీ, సైబర్ సెక్యూరిటీ వంటి మూడు కోర్సుల నేర్చుకోవాలి. ఇంజనీరింగ్‌లో మార్కులశాతంతోపాటు కంప్యూటర్ కోర్సు ఉంటేనే ఉద్యోగం వస్తుంది.



నగరంలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు (ఫైల్)

ఈఈఈ గ్రూప్ ..

ఈఈఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్) గ్రూప్ పూర్తి చేసిన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి కూడా వెళ్లే అవకాశం ఉంటుంది. విద్యార్థులు ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్ కోర్సుతో పాటు పవర్ టెక్నాలజీ సోలార్ కోర్సు చేయాలి. ఈ కోర్సులు 3 నెలల నుంచి 6నెలల వరకు ఉంటాయి.

సివిల్ గ్రూప్..

సివిల్ గ్రూప్ చదివిన విద్యార్థులు స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ రివిట్ ఆర్కిటెక్చర్, రివిట్ స్ట్రక్చర్, ఆటో క్యాడ్ కోర్సులు నేర్చుకోవాలి. వీటి ద్వారా ప్రాజెక్టుల ఏర్పాటుకు ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరడానికి అవకాశాలు ఉంటాయి.

ఈసీఈ గ్రూప్..

ఈసీఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్) గ్రూప్ చేసిన వారికి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు లభిస్తాయి. అయితే విద్యార్థులు కంప్యూటర్ కోర్సులు చేయాలి. ఆండ్రాయిడ్ సిస్టమ్, ఈఎల్ఎస్ఐ డిజైన్స్ కోర్సులతో పాటు బిగ్ డేటా ఎనటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నీ, సైబర్ సెక్యూరిటీ కోర్సులు చేయాలి. ఈ కోర్సులు 6 నెలలు ఉంటాయి. దీంతో పాటు ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్(ఐఓటీ) కోర్సు చేస్తే మరింత ఉపయోగం.

మెకానికల్ గ్రూప్ ..

మెకానికల్ గ్రూప్ విద్యార్థులు రోబోటిక్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోకేడ్, కెటియా కోర్సులు పూర్తి చేయాలి. ఇవి మూడు నుంచి ఆరు నెలలు కోర్సులుగా ఉంటాయి. ఈకోర్సులు పూర్తి చేస్తేనే ఇంటర్వ్యూల్లో ప్రాధాన్యం ఉంటుంది.

ఈకోర్సులు హైదరాబాద్, బెంగళూరులోనే..

చదువు పూర్తయిన విద్యార్థులు వెంటనే ఇంజనీరింగ్‌కు సంబంధించిన కంప్యూటర్ కోర్సులు నేర్చుకోవాలి. ఆ కోర్సులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లోనే నేర్చుకోవాలి. ఎందుకంటే అక్కడ కంప్యూటర్ కోర్సులు నేర్పేవారు అనుభవం కలిగి ఉంటారు. వారి సూచనలు ఉద్యోగం సాధించడానికి ఉపయోపడతాయి.

విజయానికి ముఖ్య పాయింట్లు

విద్యార్థులు ఇంజనీరింగ్‌లో 90 శాతం మార్కులు సాధించినా ఇంటర్వ్యూలలో వెనుకబడుతున్నారు. ప్రధానంగా సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టెక్నికల్ స్కిల్స్, హ్యూమన్ రిలేషన్స్ వంటివి పూర్తిగా కలిగి ఉంటే ఇంటర్వ్యూల్లో ఎంపికవుతారు. కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రెయినింగ్‌కు తప్పని సరిగా వెళ్లాలి. ప్రస్తుతం అన్ని కళాశాలలో అధ్యాపకులు శిక్షణ ఇస్తున్నారు. ఎలా మాట్లాడాలి అనే అంశంపై తర్ఫీదు ఇస్తున్నారు.

ఇతర కోర్సులపై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులు ఇంజనీరింగ్ పూర్తి చేసినా ఇతర కోర్సులపై కూడా అవగాహన కలిగి ఉండాలి. కంప్యూటర్ నాలెడ్జ్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి. క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరుకావాలి. అంతే కాదు చదువుకున్న కోర్సులపై పట్టు ఉండాలి. దీని వల్ల ఇంటర్వ్యూకు వెళ్లినప్పుడు ఏ ఉద్యోగానికైనా ఎంపికయ్యే అవకాశం ఉంటుంది.

- ఎస్ఎస్‌వీఎస్ శర్మ, రిటైర్డ్ ప్రొఫెసర్, ప్లేస్‌మెంట్స్ డీన్, వరంగల్

పెరుగుతున్న వరద ప్రవాహం



మేడిగడ్డ బ్యారేజీ వద్ద ప్రవాహం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీకి గురువారం వరద ప్రవాహం పెరిగింది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో వరద కాళేశ్వరం మీదుగా తరలివస్తోంది. దీంతో మేడిగడ్డ వద్ద 85 గేట్లను ఎత్తి ఉంచడంతో 5,400 క్యూసెక్కుల నీరు దిగువకు తరలుతోంది. మొత్తం 16.17 టీ ఎంసీల నీటి నిల్వ సామర్థ్యం గల బ్యారేజీలో ప్రస్తుత వరద ప్రవాహం నది మట్టానికి 89.10 మీటర్ల ఎత్తులో ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

టైమ్స్‌స్క్వేర్‌లో అరుణ్‌కుమార్ ఫొటోల ప్రదర్శన



న్యూయార్క్ టైమ్స్‌స్క్వేర్ బిల్‌బోర్డుపై నందిని గుప్తా ఫొటోగ్రాఫ్

హన్మకొండ కల్చరల్ : ప్రతిష్ఠాత్మక డిజిటల్ డిస్‌ప్లే న్యూయార్క్ టైమ్స్‌స్క్వేర్ బిల్‌బోర్డుపై భూపాలపల్లికి చెందిన ఫొటోగ్రాఫర్ అరుణ్‌కుమార్ నలిమెల తీసిన మూడు ఫొటోలు ప్రదర్శించారు. మూడు రోజులు జరిగిన ఎన్ఎఫ్‌టీ ఎన్‌వైసీ(నాన్ ఫంజిబుల్ టోకెన్- న్యూయోర్క్ సిటీ)-2025 కార్యక్రమంలో భాగంగా అరుణ్‌కుమార్ ఫొటోలు ఈ బిల్‌బోర్డుపై ప్రదర్శించారు. మిస్ వరల్డ్ -2025 పోటీల్లో భాగంగా రామప్ప దేవాయంలో భారత దేశం తరపున ప్రాతినిధ్యం వహించిన నందినిగుప్తా ఫొటోగ్రాఫ్, యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్ప దేవాలయం సందర్శన సమయంలో తీసిన ఫొటో, మహిళలు బతుకమ్మ పేరుస్తున్న దృశ్యాన్ని బిల్‌బోర్డుపై ప్రదర్శించారని అరుణ్‌కుమార్ తెలిపారు.

మత్తు పదార్థాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : మత్తు పదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె.ప్రతాప్ రెడ్డి అన్నారు. కేయూ ఎన్ఎస్ఎస్, హనుమకొండ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్తంగా 'అంతర్జాతీయ డ్రగ్ వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా గురువారం కేయూలోని సెనేట్ హాల్‌లో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఈసం నారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేయూ డ్రగ్ ఫ్రీ యూనివర్సిటీ అని, క్షణికానందం కోసం యువత తప్పటడుగు వేయొద్దన్నారు. మత్తు పదార్థాలతో వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబ, దేశంపై ప్రభావం ఉంటుందన్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ కె.పట్టాభి రామారావు మాట్లాడుతూ భావిభారత యువత మత్తు పదార్థాలపై యుద్ధం చేయాలన్నారు. అవగాహనతో శారీకక, మానసిక ఆరోగ్యం పొందొచ్చని, తద్వారా ఏదైనా సాధించొచ్చన్నారు. రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ డ్రగ్స్‌కు జీవితాన్ని బానిస చేసుకోవద్దని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను కనిపెడుతూ ఉండాలన్నారు. వరంగల్ నార్కోటిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి మాదక ద్రవ్యాల వినియోగం గొడ్డలిపెట్టు అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 'యాంటీ డ్రగ్స్', 'సే నో టు డ్రగ్స్' పోస్టర్లను ఆవిష్కరించారు. క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హనుమకొండ డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, పాలకమండలి సభ్యురాలు కె.అనితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ టీచర్‌కు 17 ఏళ్ల జైలుశిక్ష

- రూ. 1.50 లక్షల జరిమానా

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో చదివే బాలికను వేధించి, శారీరకంగా లోబర్చుకున్న ఇంగ్లిష్ టీచర్ సాతూరి మధుకర్ (52)కు 17 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1.50 లక్షల జరిమానా విధిస్తూ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ జడ్జి సునీత తీర్పు చెప్పారు. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాలు.. హనుమకొండ జిల్లా కేంద్రంలో ఉండే మధుకర్ 2013లో కాల్వ శ్రీరాంపూర్ స్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో 10వ తరగతి బాలికతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, బలవంతంగా లోబర్చుకున్నాడు. రాత్రి క్లాసుల పేరిట స్కూల్‌కు పిలిచి స్టాఫ్ రూమ్‌లో చాలాసార్లు శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే మీ అమ్మానాన్నను చంపేస్తానని బెదిరించాడు. తర్వాత బాలిక హనుమకొండలో డిగ్రీ చదువుతున్న సమయంలో మధుకర్ అక్కడి కూడా వెళ్లి ఆమెను భయపెట్టి శారీరకంగా లోబర్చుకున్నాడు. ఆమెకు తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీశాడు. తాను పిలిచినప్పుడల్లా రాకుంటే ఫొటోలు, వీడియోలు అందరికీ పంపిస్తానని బెదిరించాడు. అనంతరం ఆమెకు పెళ్లయినా వదిలిపెటలేదు. ఆమె భర్తకు ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు పంపించాడు. అవి చూసిన ఆమె భర్త విడాకులు ఇచ్చాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై ఎస్‌కే జానీపాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాదం రమేశ్ సాక్షులను ప్రవేశపెట్టి తన వాదనలు వినిపించి నేరాన్ని రుజువు చేయడంలో కీలకపాత్ర పోషించారు. జడ్జి సునీత సాక్ష్యాధారాలు పరిశీలించి నిందితుడికి 17 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించారు.

రౌడీషీటర్ దారుణ హత్య

- ఆర్థిక లావాదేవీలే కారణం..
- పోలీసుల అదుపులో నిందితులు
- నిందితుల్లో ఓ మాజీ పోలీస్ కానిస్టేబుల్..



సాధిక్ హుస్సేన్ (ఫైల్)

వరంగల్ క్రైం : నగరంలోని వడ్డేపల్లికి చెందిన రౌడీ షీటర్ మహ్మద్ సాధిక్ హుస్సేన్(48) దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన బుధవారం రాత్రి సుబేదారి పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎం.రంజిత్‌కుమార్ కథనం ప్రకారం.. మహ్మద్ సాధిక్ హుస్సేన్ తన పెద్దనాన్న కొడుకు ఖాదర్ హుస్సేన్‌కు రూ. 3 లక్షలు అప్పు ఇచ్చాడు. ఇందులో రూ. లక్ష ఇచ్చిన అనంతరం ఖాదర్ హుస్సేన్ మృతి చెందాడు. దీంతో సాధిక్ హుస్సేన్ తన మిగతా డబ్బులు తిరిగి ఇవ్వాలని ఇటీవల ఖాదర్ హుస్సేన్ కుమారులు మహ్మద్ సోహెల్, మహ్మద్ బషీర్‌ను అడిగాడు. దీంతో బుధవారం రాత్రి సాధిక్ హుస్సేన్ ఇంటికెళ్లిన మహ్మద్ సోహెల్, మహ్మద్ బషీర్.. మాట్లాడాలని సాధిక్ హుస్సేన్‌ను శ్మశాన వాటిక దగ్గరకు తీసుకొచ్చి మరో నిందితుడు అక్రమ్‌తో కలిసి హత్య చేశారు. సాధిక్ హుస్సేన్‌ను హత్య చేస్తే డబ్బులు అడిగే వారు ఎవరూ ఉండరనే కారణంతో ఇంటి నుంచి తీసుకొచ్చి బండరాయితో మోది హత్య చేశారు. నిందితుల్లో అక్రమ్ గతంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించి ఓ హత్యకేసులో నిందితుడిగా ఉండడంతో సర్వీస్ నుంచి తొలగించినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.మృతుడి చెల్లి తస్లీమా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితులు?

రౌడీషీటర్ మహ్మద్ సాధిక్ హుస్సేన్ హత్య కేసులో నిందితులుగా ఉన్న మహ్మద్ సోహెల్, మహ్మద్ బషీర్, మహ్మద్ అక్రమ్ పోలీసులు అదుపులో ఉన్నట్లు తెలిసింది. సాధిక్ హుస్సేన్ హత్య విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న సుబేదారి ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ ఎదుట నిందితులు నేరుగా వచ్చి నేరం అంగీకరించి లొంగిపోయినట్లు తెలిసింది. పోలీసులు మాత్రం ధ్రువీకరించలేదు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు విడుదల

- ఐదవ సెమిస్టర్‌లో 50.56 శాతం..
- ఆరవ సెమిస్టర్‌లో 50.16శాతం ఉత్తీర్ణత



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, పరీక్షల విభాగం అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో ఏప్రిల్, మేలో నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బి ఒకేషనల్, బీఏఎల్ ఐదవ, ఆరవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం క్యాంపస్‌లో వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం, పరీక్షల విభాగం అధికారులతో కలిసి విడుదల చేశారు. ఆయా కోర్సుల్లో ఐదవ సెమిస్టర్ పరీక్షల ఫలితాల్లో మొత్తం 13,963 మంది విద్యార్థులకుగాను 7,059 మంది (50.56శాతం) ఉత్తీర్ణులయ్యారని పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్ తెలిపారు. ఆరవ సెమిస్టర్ పరీక్షలకు 37,999మంది విద్యార్థులు హాజరుకాగా, 19,060 (50.16శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఆయా పరీక్షల ఫలితాలను కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు తిరుమలాదేవి, వెంకటయ్య, సౌజన్య, పద్మజ, ఆసిం ఆక్బాల్, నాగరాజు, కేయూ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు..

ఆయా డిగ్రీ కోర్సుల సెమిస్టర్ల విద్యార్థులకు రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. 15 రోజుల సమయం ఉంటుంది. ఆన్‌లైన్‌లోనే సంబంధిత వెబ్‌సైట్‌ద్వారా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారు. వివరాలు కూడా అందులోనే ఉంటాయి.

త్వరలో 2,4 సెమిస్టర్ల వాల్యుయేషన్ ప్రక్రియ..

డిగ్రీ కోర్సుల రెండు, నాలుగు, ఐదవ, ఆరవ సెమిస్టర్ల పరీక్షలు ఒకేసారి జరిగినా తొలుత ఫైనలియర్ విద్యార్థులకు సంబంధించిన ఆరవ సెమిస్టర్ పరీక్షలు, బ్యాక్‌లాగ్ ఐదవ సెమిస్టర్ పరీక్షల జవాబుపత్రాలు మూల్యాంకనం చేయించారు. తద్వారా ఆయా విద్యార్థులు వివిధ ఉన్నత విద్య కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం ఉంటుంది. వాస్తవంగా ఈసారి ప్రైవేట్ యాజమాన్యాలకు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో పరీక్షల ఫీజులు చెల్లించడంలో జాప్యం చేసిన విషయం తెలిసిందే. దీంతో పరీక్షలు ఆలస్యంగా జరిగాయి. 2, 4 సెమిస్టర్ల పరీక్షల జవాబుపత్రాలకు సంబంధించిన మూల్యాంకనం త్వరలోనే నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ఈ ఫలితాలు వచ్చేసరికి కొంతసమయం పట్టే అవకాశం ఉంది. డిగ్రీ కోర్సుల ఒకటి, మూడో సెమిస్టర్‌కు సంబంధించిన బ్యాక్ లాగ్ సబ్జెక్టుల పరీక్షలు ఇటీవలే ముగిశాయి.

విషసర్పాలతో తీరని విషాదం..

విషసర్పాలతో తీవ్ర విషాదం అలుముకుంది. అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాములు కాటు వేయడంతో ఓ వ్యక్తి, ఓ బాలుడు మృతి చెందాడు. దీంతో ఆ రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి. ఈ ఘటనలు జయశంకర్‌భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో చోటు చేసుకున్నాయి.

- పాముకాటుతో ఇద్దరి మృతి
- టేకుమట్ల, దంట్లకుంటతండాలో ఘటనలు
- శోకసంద్రంలో మృతుల కుటుంబాలు



శ్రీనివాస్(ఫైల్)

టేకుమట్ల: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రానికి చెందిన బొల్లు శ్రీనివాస్(55) కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్ర సమీప గ్రామం అంకుషాపూర్‌లో ఉంటున్నాడు. భార్య, కుమారుడు హైదరాబాద్‌లో ఉండగా శ్రీనివాస్ ఒంటరిగా కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీనివాస్ మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాము కాటుకు గురయ్యాడు. తెల్లవారుజామున స్థానికులకు తెలపడంతో వారు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దంట్లకుంటతండాలో బాలుడు..



రమేశ్ మృతదేహం

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం దంట్లకుంటతండాకు చెందిన గుగులోత్ భీమ్యా, నీల దంపతులు కవల కుమారుడు రమేశ్ (4) తల్లి నీలతో కలిసి బుధవారం అర్ధరాత్రి ఇంట్లో కింద నిద్రిస్తున్నాడు. ఈ సమయంలో రమేశ్‌ను పాము కాటు వేసింది. అనంతరం అదే పాము ఇంటి ఎదుట ఉన్న కోళ్ల గూటిలోకి వెళ్లడంతో కోళ్లు అరిచాయి. దీంతో కుటుంబ సభ్యులు నిద్ర లేచి గూటిలో చూడగా పాము కాటుతో రెండు కోడి పిల్లలు మృతి చెంది కనిపించాయి. అనుమానంతో తల్లిదండ్రులు ఇంట్లోకి వచ్చి చూడగా బాలుడికి పాము కాటు గుర్తులు, రక్తం కనిపించింది. దీంతో లబోదిబోమంటూ చికిత్స నిమిత్తం అదేరోజు రాత్రి ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రేక్షకులపై ఊడి పడిన సీలింగ్



ప్రేక్షకులు కూర్చున్న సీట్లపై పడిన సీలింగ్

మహబూబాబాద్ రూరల్ : సినిమా చూస్తున్న ప్రేక్షకులపై ఒక్కసారిగా సీలింగ్ పడగా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏషియన్ ముకుంద థియేటర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. థియేటర్లో బుధవారం ప్రేక్షకులు 'కుబేర' సినిమా చూస్తున్నారు. రాత్రి సుమారు 11.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా సీలింగ్ పైకప్పుభాగం ఊడిపడడంతో ప్రేక్షకులు భయభ్రాంతులకు గురై వెంటనే థియేటర్ నుంచి బయటకు పరుగులు తీశారు. అప్రమత్తంగా ఉండడంతో ప్రాణ నష్టం తప్పింది. కాగా, కొద్దిసేపు ఉల్లాసం కోసం వస్తే ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చిందని ప్రేక్షకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోర్టులో లొంగిపోయిన నిందితుడు

- జడ్జి ఆదేశాలతో జైలుకు తరలింపు?

ఖిలా వరంగల్: కులం పేరుతో దూషిస్తూ తన భూమిని కబ్జా చేశారనే మనస్తాపంతో వరంగల్ కరీమాబాద్‌కు చెందిన పాలెపాక కుమారస్వామి పెట్రోల్‌పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. కుమారస్వామి ఆత్మహత్యకు కారణమైన బండి కుమారస్వామి, తాళ్ల మల్లేశం, పులి రంజిత్‌రెడ్డిపై వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. జూన్ 9వ తేదీ సాయంత్రం వరంగల్ ఉర్సుగుట్ట తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల వద్ద ఈ ఘటన జరగగా.. ముగ్గురు నిందితులు అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. అయితే గురువారం మధ్యాహ్నం వరంగల్ జిల్లా కోర్టులో న్యాయమూర్తి ఎదుట బండి కుమారస్వామి లొంగిపోయాడు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడు బండి కుమారస్వామిని హుజూరాబాద్ జైలుకు తరలించినట్లు తెలిసింది. కాగా, నిందితుడు బండి కుమారస్వామిని విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులు ఒకటి, రెండు రోజుల్లో తిరిగి కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.